RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 330 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | ఆదివారం, 2 జూన్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# రుణమాఫీకి మహారాష్ట్ర మోడల్!

## పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం




### అధ్యయనానికి వెళ్లిన అగ్రికల్చర్, ఫైనాన్స్ ఆఫీసర్లు - త్వరలో రాష్ట్ర సర్కారుకు ఆఫీసర్ల రిపోర్ట్
### పూర్తి అధ్యయనం తర్వాతే గైడ్‌లైన్స్ ఖరారు - 2019లో రూ.2 లక్షల క్రాప్‌లోన్లు మాఫీ చేసిన మహారాష్ట్ర

హైదరాబాద్ : పంద్రాగస్టు కల్లా రైతుల క్రాప్?లోన్లు మాఫీ చేస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి ఆ దిశగా చర్యలు వేగవంతం చేశారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో పంట రుణాలు మాఫీ చేసిన విధానాలను అధ్యయనం చేస్తున్నారు. 2019లో మహారాష్ట్ర సర్కారు ఒకేసారి రూ.2 లక్షలలోపు రూ.20 వేల కోట్ల పంట రుణాలను మాఫీ చేసింది. ఇదే మోడల్ మన రాష్ట్రంలోని పరిస్థితులకు కూడా అతికినట్టు సరిపోవడంతో ఆ పద్ధతిలోనే ఇక్కడా రుణమాఫీ చేయాలని భావిస్తున్నారు. సర్కారు ఆదేశాల మేరకు మహారాష్ట్ర మోడల్‌ను అధ్యయనం చేసేందుకు అగ్రికల్చర్, ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్లకు చెందిన సీనియర్ ఆఫీసర్లు ఇటీవలే ముంబైకి వెళ్లివచ్చారు. మహారాష్ట్రలో పంట రుణాలు ఎలా మాఫీ చేశారనేదానిపై అక్కడి ఉన్నతాధికారులతో రెండు రోజుల పాటు స్టడీ చేశారు. మహారాష్ట్రతో పాటు రాజస్థాన్‌లోనూ ఇదే తరహాలో పంట రుణాల మాఫీ అమలు చేశారని అధికారులు చెబుతున్నారు.

**మహారాష్ట్రలో ఏకకాలంలో రుణమాఫీ...** మహారాష్ట్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతిబా పూలే షేట్కారీ ఖర్జ్ ముక్తి యోజన పేరుతో రూ.2 లక్షల పంట రుణాలను మాఫీ చేసింది. 2015 ఏప్రిల్1 నుంచి 2019 మార్చి 31వరకు ఉన్న పంట రుణాలను ఏకకాలంలో మాఫీ అమలుచేసింది. మహారాష్ట్రతో పాటు రాజస్థాన్‌లోనూ కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌ను నోడల్ ఏజెన్సీగా ఏర్పాటు చేసి రైతులకు రుణవిముక్తి కల్పించారు. ఈ నోడల్ ఏజెన్సీకి సర్కారు ష్యూరిటీ ఇచ్చి అసలు, వడ్డీతో కలిపి వాయిదాల పద్ధతిలో చెల్లిస్తోంది. అయితే, తెలంగాణలో కోఆపరేటివ్ డిపార్ట్‌మెంట్ కాకుండా వ్యవసాయ, ఆర్థిక శాఖల సమన్వయంతోనే రుణమాఫీ చేయాలని రాష్ట్ర సర్కారు యోచిస్తోంది. దీనిపై త్వరలోనే అధికారులు సర్కారుకు నివేదిక అందించనున్నారు. నివేదిక అందిన తర్వాత గైడ్ లైన్స్ ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది.

**సమగ్ర అధ్యయనం తర్వాత గైడ్ లైన్స్...** రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తే రూ.2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల టైంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. మేనిఫెస్టోలోనూ ఈ అంశాన్ని చేర్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఇటీవలి పార్లమెంట్ ఎన్నికల టైంలోనూ ఇదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రచారాస్త్రంగా వాడుకున్నారు. ఆగస్టు 15లోగా ఏకకాలంలో క్రాప్‌లోన్లు మాఫీ చేస్తామని పలుమార్లు ప్రకటించారు. కాంగ్రెస్ సర్కారు రుణమాఫీ చేస్తే తన పదవికి రాజీనామా చేస్తానని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. రాజీనామాతో రెడీగా ఉండాలని సీఎం ప్రతిసవాల్ విసరడంతో ఈ అంశం రాజకీయాలను హీటెక్కించింది. ఇటు రైతుల్లోనూ రుణమాఫీపై ఉత్కంఠ నెలకొంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగస్టు 15 నాటికి క్రాప్‌లోన్లను మాఫీ చేసి తీరాలని సీఎం రేవంత్ పట్టుదలతో ఉన్నారు. ఆయన ఆదేశాలతో ఇప్పటికే బ్యాంకర్లు క్రాప్‌లోన్ల లెక్కలు తీసి సర్కారుకు అందించారు. గైడ్ లైన్స్ పై అధికారులు కూడా కసరత్తు చేస్తున్నారు. వడ్డీ మాఫీ విషయంలో, స్వల్పకాలిక పంట రుణాలతో పాటు బంగారం కుదువబెట్టి తీసుకున్న పంట రుణాలపై సర్కారు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అలాగే కుటుంబం యూనిట్‌గా తీసుకోవాల్నా అలా తీసుకుంటే గుర్తింపు కోసం రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోవాల్నా ప్రభుత్వ ఉద్యోగులను, ట్యాక్స్ పేయర్లను అర్హులుగా గుర్తించాల్నా వద్దా ఇలాంటి అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయి. పలు పథకాల్లో గత బీఆర్ఎస్ సర్కారు అనుసరించిన విధానాల వల్ల పెద్దమొత్తంలో ప్రజాధనం దుర్వినియోగమైందనే విమర్శల నేపథ్యంలో పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన తర్వాతే గైడ్ లైన్స్ రూపొందించాలని అధికారులు భావిస్తున్నారు.

**డిసెంబర్ 9 కటాఫ్ తేదీ!...** డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన రావడంతోపాటు కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీ బర్త్?డే సైతం అదేరోజు కావడంతో ఈ తేదీకి పార్టీ పరంగా ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. అందుకే దీనిని సెంటిమెంట్‌గా భావించి ఇదే రోజును పంట రుణాలకు కటాఫ్ తేదీగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. 2023 డిసెంబర్ 9 నాటికి రైతులకు ఉన్న క్రాప్ లోన్లను మాఫీ చేయాలని సర్కారు భావిస్తోంది. ముందుగా కటాఫ్ తేదీతో పాటు పంట రుణాల మాఫీకి విధివిధానాలను సర్కారు ప్రకటించనుంది. ఆ తర్వాతే బ్యాంకులు రైతుల పంట రుణాల లెక్కలు తేల్చనున్నారు. రుణమాఫీ వల్ల సర్కారుపై సుమారు రూ.25 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్ల వరకు భారం పడవచ్చని ఆర్థికశాఖ అంచనా వేస్తోంది.

# కోడ్ ముగియగానే పాలనపై ఫోకస్.. ఫస్ట్ ప్రియారిటీ ఇదే..!



హైదరాబాద్ : లోక్ సభ ఎన్నికల కోడ్ పూర్తి కాగానే రాష్ట్ర ప్రభుత్వం పాలనతో పాటు అభివృద్ధిపై ఫోకస్ పెట్టనున్నది. ఫస్ట్ ఫేజ్‌లో మూసీ నది సుందరీకరణ పనులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలను ప్రక్షాళన చేయాలని సర్కార్ భావిస్తోంది. మూసీ నది సుందరీకరణ కోసం ఇప్పటికే 15 టెండర్లు రాగా, అందులో నిబంధనల ప్రకారం 7 టెండర్లు అర్హత పొందినట్లు తెలిసింది. వీటిలో త్వరలోనే ఎల్ 1, ఎల్ 2ను ఎంపిక చేసి సుందరీకరణ పనులు మొదలు పెడతామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు మూసీ రివర్‌పై అక్రమంగా నిర్మించిన 12 వేల అక్రమ కట్టడాలను విడతల వారీగా తొలగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. బ్యూటిఫికేషన్‌లో భాగంగా ఈస్ట్, వెస్ట్ సిటీలను కలుపుతూ గండిపేట నుంచి గౌరెల్లి వరకు మూసీపై 55 కిలోమీటర్ల మేర రెండు వైపులా అత్యాధునిక ఎలివేటెడ్ కారిడార్లు నిర్మించనున్నారు. మూసీకి అనుకొని కమర్షియల్ కాంప్లెక్స్ లు, వాటర్ ఫాల్స్, లైటింగ్స్, గ్రీనరీ, స్పోర్ట్స్ గేమింగ్ మాల్స్ ఏర్పాటు చేయనున్నారు.

**హెచ్ఎండీఏకు కొత్త ఆఫీసర్లు..?...** హెచ్ఎండీఏలో భారీ మార్పులు చోటు చేసుకునే చాన్స్ ఉన్నట్లు సమాచారం. తప్పిదాలు, ఇతర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆఫీసర్లను తప్పించి కొత్త వాళ్లకు చోటు కల్పించాలనేది ప్రభుత్వం నిర్ణయం. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి వరుసగా హెచ్ఎండీఏ, మున్సిపల్ శాఖ అధికారులతో రివ్యూ చేస్తున్నారు. మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ, హెచ్ఎండీఏ విస్తరణ వంటి ప్రోగ్రాములను సీఎం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో కొత్త కమిషనర్‌ను నియమించాలనే ఆలోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రేసులో శ్రీదేవి, ఆమ్రపాలి ఉన్నట్లు సమాచారం.

**వైద్యశాఖలో కూడా..?...** వైద్యారోగ్యశాఖలోనూ భారీగా బదిలీలు ఉండే అవకాశం ఉన్నట్లు టాక్. ఏపీకి వెళ్లిన హెచ్‌వోడీ పోస్టులను క్రియేట్ చేస్తూ, సీనియారిటీ ప్రకారం ఆయా పోస్టుల్లో అధికారులను నియమించేందుకు ఉన్నతాధికారులు కసరత్తు మొదలు పెట్టారు. పబ్లిక్ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ వంటి విభాగాల్లో కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. దీంతో పాటు టీఎస్ఎంఎస్ఐడీసీలోనూ కొత్త అధికారులు, స్టాఫ్‌ను నియమించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఇప్పటికే సమర్థవంతమైన అధికారులు, స్టాఫ్ వివరాలను ప్రభుత్వం సేకరించినట్లు తెలిసింది. కోడ్ ముగిసిన మరుక్షణమే స్థాన చలనాలకు సర్కార్ శ్రీకారం చుట్టనున్నది.



## సీఎం రేవంత్‌రెడ్డికి భారాస అధినేత కేసీఆర్ లేఖ

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భారాస అధినేత కేసీఆర్ 22 పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు రావాలని ఆహ్వానం పంపిన నేపథ్యంలో ప్రజల పక్షాన బహిరంగ లేఖ రాస్తున్నట్టు తెలిపారు. “ తెలంగాణ రాష్ట్ర అవతరణ సుదీర్ఘ ప్రజా పోరాట ఫలితం.. అమరుల త్యాగాల పర్యవసానం. కానీ, కాంగ్రెస్ దయాభిక్షగా మీరు చేస్తున్న ప్రచారాన్ని నిరసిస్తున్నాను. 1969 నుంచి ఐదు దశాబ్దాలు, భిన్నదశలలో, భిన్నమార్గాలలో ఉద్యమ ప్రస్థానం సాగింది. తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ రక్తసిక్తం చేసిందనేది మీరు దాచేస్తే దాగని సత్యం. 1952 ముల్కీ ఉద్యమంలో సిటీ కాలేజీ విద్యార్థులపై కాల్పులు జరిపి నలుగురు విద్యార్థుల ప్రాణాలు పొట్టన పెట్టుకున్నది ఆదిగా.. కాంగ్రెస్ క్రూర చరిత్ర కొనసాగింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవం ఒక ఉద్విగ్న, ఉత్తేజకరమైన సందర్భమే. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమన దిశగా తీసుకుపోతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కేసీఆర్ పాల్గొనడం సమంజసం కాదని భారాస, తెలంగాణ వాదుల అభిప్రాయంగా ఉంది” అని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు.




# ఏమో గుర్రం ఎగురావచ్చు..!

## కేంద్రంలో బీజేపీయేతర ప్రభుత్వం రాబోతోందా?

## ఓడలు బళ్ళవుతాయా..?

ఈసారి జనరల్ ఎలక్షన్ల తొలిదశ పోలింగ్ జరిగే వరకూ కేంద్రంలో బీజేపీయేతర ప్రభుత్వం వస్తుంది అనే మాట అనడానికి చాలామందికి ధైర్యం చాలని పరిస్థితి. ఏ యాంగిల్లో ఆలోచించి బీజేపీ ప్రభుత్వం రాదని అనుకుంటున్నావయ్యా అని ఎవరైనా నిలదీస్తే సమాధానం చెప్పలేని పరిస్థితి. ఒకపక్క బీజేపీ వాళ్ళు గత పది సంవత్సరాలుగా దేశాన్ని అద్భుతంగా పరిపాలిస్తూ దేశాన్ని ఎక్కడికో తీసుకెళ్ళిపోయారంటూ నినదించే గొంతులు ఎక్కువ అయ్యాయి. ఆ నినాదాలో హెూరులో వున్నవాళ్ళకి వేరే ఆలోచన కూడా రాలేని పరిస్థితి. పైగా మోడీ గారు అయోధ్యలో రామాలయాన్ని కూడా ప్రారంభించేశారు కాబట్టి ఉత్తర భారతదేశం మొత్తం భక్తి పారవశ్యంలో ఊగిపోతోందని.. ఎప్పుడెప్పుడు ఎలక్షన్లు వస్తాయా, రామాలయం కట్టించిన మోడీకి అర్జెంటుగా ఓటు వేసేసి రుణం తీర్చుకోవాలా అని ఉత్తర భారతదేశంలోని ఓటర్లందరూ ఉవ్విళ్ళూరుతున్నారని బిల్డప్పు క్రియేట్ అయింది. ఆ తర్వాత ఒక్కో దశ ఎన్నికలు ముగిసేకొద్దీ.. ఇటు దక్షిణ భారతదేశంలోగానీ, అటు ఉత్తర భారతదేశంలోగానీ మోడీ మంత్రం పెద్దగా పనిచేయలేదనే ‘వేవ్’ కనిపించింది. 400 సీట్ల మోడీ డ్రీమ్ నెరవేరే అవకాశాలు లేవేమోనన్న సందేహాలు ప్రారంభమయ్యాయి. అలా ఒక్కో భ్రమలు తొలగుతూ ప్రస్తుతం బీజేపీకి ఒంటరిగా గానీ, ఎన్డీయే కూటమికి గానీ పూర్తి స్థాయి మెజారిటీ వచ్చే అవకాశం లేదనే అంచనాలు ఏర్పడ్డాయి. ఎన్నికల ఫలితాలు అటు ఇటు ఎన్డీయే కూటమితోపాటు అటు ఇండియా కూటమి కూడా నువ్వా నేనా అనే నిలిచేలా వుంటాయని అనిపిస్తోంది. అలాంటి పరిస్థితే వస్తే ఇప్పుడున్న రెండు కూటములూ అటూ ఇటు అయ్యి కొత్త కూటములు ఏర్పడే అవకాశం వుంటుంది. పోలింగ్ సరళిని గమనించిన తర్వాత కాంగ్రెస్ పార్టీ పకడ్బందీగా రంగంలోకి దిగింది. ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో వున్న పార్టీలను ఆకర్షించే పనిలో పడింది. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీని. “తెలుగుదేశం మా పాత మిత్రపక్షమే” అనే కామెంట్ తాజాగా కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చింది. అంటే అర్థం ఏమిటి? ఫలితాలు వచ్చిన తర్వాత పార్టీల కొత్త సమీకరణ అవసరమైన పక్షంలో టీడీపీని సంప్రదించడానికి మేం ఎంతమాత్రం మొహమాటపడం అని. బీజేపీకి ఈసారి పూర్తి మెజారిటీ రాని పక్షంలో మోడీ ప్రధానిగా మళ్ళీ ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడుతుందని అనుకోవడం కష్టమే. కాంగ్రెస్ తన చాణక్యం ప్రదర్శించిందంటే, కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం రావడం అసాధ్యమయ్యే అవకాశం కూడా వుంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## ఎన్నికల్లో ఐటీ పట్టుకున్న నల్ల సొమ్ము చూస్తే వామ్మో!

ఎన్నిక ఎన్నికకూ ప్రజల చైతన్యం ఎంతమేరకు పెరిగిందో తెలియదు కానీ నల్ల ధనం మాత్రం కట్టలు తెంచుకుంటోంది. నల్ల కట్ల పాములు మాత్రం బుసలు కొడుతూ ప్రజాస్వామ్యం మీద విషపు కాటు వేస్తూనే ఉన్నాయి. అది ప్రతీ ఎన్నికకూ పెరిగిపోతున్నాయి. తాజాగా అంటే 2024 ఎన్నికల్లో ఇన్ కం టాక్స్ విభాగం పట్టుకున్న నల్ల ధనం మే 30 అంటే గురువారం నాటికి అక్షరాలా 1100 కోట్లు పై మాటగా తేలింది. దీనితో పాటు బంగారం కూడా ఐటీ శాఖ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు ఎన్నికల్లో బయటకు వచ్చిన నల్ల ధనం దేశవ్యాప్తంగా వందల కోట్లు అని ఒక లెక్క తేలింది. ఇదే నల్ల ధనం 2019 ఎన్నికల్లో చూస్తే 390 కోట్లుగా ఉంది. అంటే ఇపుడు మూడింతలు నల్ల సొమ్ముని ఐటీ అధికారులు పట్టుకున్నారు అన్న మాట. ఇదంతా అధికారులకు దొరికినది. ఇంకా దొరకని సొమ్ము ఎంత అన్నది ఊహలకూ లెక్కలకూ అందనంతగా ఉంది అని అంటున్నారు. ఇక ఈ నల్ల ధనం ఎక్కడ ఎక్కువగా పట్టుకున్నారు అంటే ఢిల్లీ తమిళనాడు, కర్నాటకలోనే ఎక్కువగా పట్టుకున్నట్లుగా ఐటీ వర్గాలు చెబుతున్నాయి. ఈసారి చూస్తే ఎన్నికల షెడ్యూల్ మార్చి 16న వచ్చింది. దాంతో రండున్నర నెలల పాటు దేశంలో ఐటీ సోదాలు దాడులు నిర్వహించింది. తమకు ఎక్కడ సమాచారం ఉన్నా వెంటనే వాలిపోయి నగదుని స్వాధీనం చేసుకుంది. ఆ విధంగా లెక్కా పత్రం లేకుండా ఐటీకి చేరిన నల్ల ధనం ఇంత అని అంటున్నారు. ఇక ఈసారి ఎన్నికల్లో కేవలం దేశంలో ఎన్నికల ఖర్చు అంతా లక్ష కోట్లకు పై దాటి ఉంటుందని అంటున్నారు. ఏపీలోనే ప్రధాన పార్టీలు వేలలలో ఖర్చు చేశాయని చెబుతున్నారు. ఒక వైపు ఎన్నికల సంఘం విధించిన నిబంధనలు చూస్తే నలభై లక్షల వరకూ మాత్రమే ఎమ్మెల్యే అభ్యర్థి ఖర్చు చేయాల్సి ఉంది. కానీ దానికి వంద రెట్లు వేయి రెట్లు ఖర్చు చేశారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే మాత్రం ఈసారి ఎన్నికలు ఎన్నడూ లేనంత ధన ప్రవాహం తో నిండిపోయాయని అంటున్నారు. దేశంలో కొన్ని రాష్ట్రాల వార్షిక బడ్జెట్ తో సరిసాటిగా ఈసారి ఎన్నికల్లో పార్టీలు పెట్టిన ఖర్చు ఉందని అంటున్నారు. మరి ఇదంతా బ్లాక్ మనీయే అని అంటున్నారు. ఎందుకంటే ఎన్నికల్లో వీటికీ లెక్కా జమా ఉండదు. వీటిని ఎక్కడ నుంచి ఎక్కడ వరకూ అయినా తీసుకెళ్ళి ఖర్చు చేయవచ్చు. ఆ విధంగా నల్ల కుబేరులు అంతా ఎన్నికల్లో కట్ల పాములను దించేసారు అని అంటున్నారు. అంతే కాదు ఈసారి ఎన్నికలు సుదీర్ఘ కాలం జరగడం వల్ల కూడా ఖర్చు బాగా పెరిగింది అన్నది మరో మాటగా ఉంది.

# హరితహారం.. ఇక వన మహోత్సవం



హైదరాబాద్: వానాకాలం సమీపించడంతో మొక్కలు నాటే కార్యక్రమానికి జీహెచ్ఎంసీ సిద్ధమైంది. గత ప్రభుత్వం ఎనిమిదేళ్లపాటు హరితహారం పేరుతో పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకుంది. అందులోని లోపాలను సరిదిద్దుతూ.. ప్రస్తుత సర్కారు వన మహోత్సవం కార్యక్రమానికి నడుంబిగించింది. నగరవాసుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా, జీవ వైవిధ్యాన్ని పెంపొందించేలా విస్తృత స్థాయిలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక రచించింది. వర్షాకాలం ముగిసేలోపు 30లక్షలకు పైగా చెట్లను నాటుతామని, కాలనీ పార్కుల్లోని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు స్పష్టం చేశారు.

దేశీ జాతులకు ప్రాధాన్యం ఇలా చేస్తారు..

ప్రధాన రహదారులపైగాక కాలనీ రోడ్లు, విభాగినులు, అంతర్గత రహదారులు, మోడల్ కారిడార్ల పొడవునా అలంకరణ జాతులకు చెందిన మొక్కలను అవెన్యూ ప్లాంటేషన్ కింద విస్తృతంగా నాటనున్నట్లు యూబీడీ విభాగం వెల్లడించింది. శేరిలింగంపల్లి, చార్మినార్ జోన్ల పరిధిలోని రోడ్డు విభాగినులపై వరుసగా 1.13 లక్షలు, 70వేలు, కూకట్పల్లి జోన్ రహదారులపై 18వేల మొక్కలను నాటాల్సి ఉందన్నారు. ఎల్బీనగర్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, కూకట్పల్లి జోన్లలో 38,400 మొక్కలను మియావకి పద్ధతిలో నాటాలని బల్దియా నిర్ణయించింది. మొత్తంగా ఆరు జోన్లలో 30లక్షల మొక్కలు నాటాలనేది లక్ష్యం.ప్రమాదకర వృక్షాలపై సర్వే

రకరకాల కారణాలతో చనిపోయే దశకు చేరుకున్న, కూలేందుకు సిద్ధంగా ఉన్న చెట్లను గుర్తించేందుకు జీహెచ్ఎంసీ యూబీడీ విభాగం సర్వే ప్రారంభించింది. ఇప్పటివరకు 384 చెట్లను పరిశీలించామని తెలిపారు. మరోమారు పరిశీలించి.. చనిపోయిన చెట్లు, అనారోగ్యంతో ఉన్నవి, పాదచారులు లేదా వాహనదారులకు ప్రమాదకరంగా మారినవిగా వర్గీకరించాల్సిందిగా ఆదేశించామన్నారు. ఆ వివరాలు వచ్చాక.. వృక్షాల రక్షణ కమిటీ(ట్రీ ప్రొటెక్షన్ కమిటీ), జీహెచ్ఎంసీ కమిషనర్తో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కొన్నింటిని వేరేచోట నాటాల్సి ఉంటుందని, మరికొన్నింటిని తొలగించడం, బతికే అవకాశమున్న వృక్షాలకు మందులతో చికిత్స వంటి చర్యలను తీసుకోవాల్సి ఉంటుందన్నారు.నగర వాతావరణంలో సులువుగా, బలమైన వేర్లతో వృద్ధిచెందే దేశీజాతి మొక్కలకు వన మహోత్సవంలో అధిక ప్రాధాన్యమిస్తున్నట్టు జోనల్ అధికారులు వెల్లడించారు. అవసరమైన చోట రావి, వేప, పలు ఇతర మొక్కలను నాటుతామన్నారు. రోడ్ల పొడవునా, పార్కులు, సంస్థల్లో నీడనిచ్చే రకాలను పెంచుతామన్నారు. గాలి, వానలను తట్టుకుని నిలిచేపై దృష్టిపెట్టామన్నారు. ఇంటింటికీ అందజేసేందుకు పలు పెరటి మొక్కలు, పండ్ల జాతులను నర్సరీల్లో సిద్ధం చేశామన్నారు. నగరవ్యాప్తంగా 600 నర్సరీలు అందుబాటులో ఉన్నాయని, వానలు మొదలవగానే వన మహోత్సవాన్ని చేపడతామని యూబీడీ(అర్బన్ బయో డైవర్సిటీ) విభాగం అదనపు కమిషనర్ సునందరాణికు తెలిపారు.

# నగరానికి విదేశీ రోగుల వలస



హైదరాబాద్:భారతీయులు వైద్య చికిత్సల కోసం విదేశాలకు వెళ్లడం పాత మాట. ఇప్పుడు విదేశాల నుంచే రోగులు వైద్య చికిత్సల కోసం భారత్ వైపు.. అందునా మన భాగ్యనగరం వైపు చూస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకే కాదు.. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చి చికిత్సలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన ఈస్ట్ ఆఫ్రికా దేశాల నుంచి నగరానికి వస్తున్నారు. ఇటీవల నైజీరియాకు చెందిన ఇద్దరు రోగులు గాల్బ్లాడర్ కేన్సర్ చికిత్సల కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎంఎన్జే కేన్సర్ ఇనిస్టిట్యూట్ను ఆశ్రయించారు. తొలుత వీరు నగరంలోని పలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో సంప్రదించారు. అక్కడ చికిత్సలకు రూ. 9 లక్షల వరకు అవుతుందని చెప్పడంతో.. ఎంఎన్జేలో వైద్యులను సంప్రదించారు. ఇందులో ఒకరికి రూ. 3 లక్షల ప్యాకేజీకే విజయవంతంగా చికిత్స చేశారు. మున్ముందు ఈ సేవలను మరింత విస్తరించనున్నామని ఎంఎన్జే డైరెక్టర్ డాక్టర్ ముత్తా శ్రీనివాసులు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి.. ఇప్పటికే ఎంఎన్జేలో చికిత్స కోసం తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిస్సా, మహారాష్ట్ర, కర్ణాటక, బిహార్ తదితర రాష్ట్రాలకు చెందిన కేన్సర్ రోగులు వస్తుంటారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద రోగులకు సేవలు అందిస్తున్నారు. కొందరికి మానవీయ కోణంలో ఉచితంగా చేస్తున్నారు. గతంతో పోల్చితే ఎంఎన్జేలో ఆధునిక సేవలు అందుబాటులోకి వచ్చాయి. రోబోటిక్ సాయంతో ఇప్పటికే 100 సర్జరీలు పూర్తి చేశారు. అధునాతనమైన రేడియేషన్ యంత్రాలతో చికిత్స అందిస్తున్నారు. ఏటా 1.65 లక్షల మందికి చికిత్సలు చేస్తున్నారు. ఏటా 4500 మేజర్, మరో 6 వేల మైనర్ చికిత్సలు చేస్తున్నారు. రక్త కేన్సర్లకు కీలకమైన బోన్మ్యారో మార్పిడి సేవలు అందుబాటులో ఉన్నాయి. రోజుకు 300 మందికి రేడియేషన్, మరో 300 మందికి కీమో థెరఫీ చికిత్సలు చేస్తున్నారు.

ఎన్ఏబీహెచ్లో 35పైనే గుర్తింపు

జాతీయ స్థాయి గుర్తింపు పొందిన ఆసుపత్రులు హైదరాబాద్లో అధికంగా ఉండటంతో విదేశీయులు వరుస కడుతున్నారు. ఈస్టు ఆఫ్రికా, మధ్యప్రాచ్యం, దక్షిణాసియా తదితర దేశాల నుంచి అత్యధికంగా వైద్య పర్యాటకులు ఇక్కడకు విచ్చేస్తున్నారు. ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే నగరంలో తక్కువకే వైద్య సేవలు అందుతుండటం కూడా ఒక కారణం. ఈ నేపథ్యంలో విదేశీ రోగులకు మరింత సేవలు ఇచ్చేందుకు పలు కార్పొరేట్ ఆసుపత్రులు దుబాషీలను ఏర్పాటు చేస్తున్నాయి.

జాతీయ ఆసుపత్రుల గుర్తింపు బోర్డు(ఎన్ఏబీహెచ్)లో నగరానికి చెందిన 35 ఆసుపత్రులపైనే ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ రంగంలో ఉస్మానియా, గాంధీ ఆసపత్రులున్నాయి. ఒకప్పుడు గుండె శస్త్ర చికిత్స అంటే అమెరికా, ఆస్ట్రేలియా ఇతర అభివృద్ధి చెందిన దేశాలకు వెళ్లాల్సిందే. ప్రస్తుతం నగరంలో నెలకు వందల సంఖ్యలో బైపాస్ సర్జీలు జరుగుతున్నాయి. మూత్రపిండాలు నుంచి ఊపితిత్తులు, కాలేయం, గుండె, క్లోమగ్రంథి ఇలా అన్ని రకాల అవయవ మార్పిడిలో నగర ఆసుపత్రులు ముందుం టాయి. నిమ్స్, ఉస్మానియా, గాంధీలో సైతం అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. కేన్సర్, హృద్రోగ చికిత్సల రేడియషన్, కీమో, టార్గెట్ థెరపీ యంత్రాలు, అధునాతనమైన క్యాత్ల్యాబ్లు పలు కార్పొరేట్, ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ అందుబాటులో ఉన్నాయి.

# కబ్జాల గుప్పిట కుంటలు, చెరువులు

హైదరాబాద్: స్థిరాస్తి వ్యాపారులు బరితెగిస్తున్నారు. చెరువులు, కుంటలను రాత్రికిరాత్రే పూడ్చిపెడుతున్నారు. ,ఒకప్పుడు నిండు నీళ్లతో కళకళలాడిన చెరువులు, కుంటలు లేఅవుట్లుగా మారుతున్నాయి. కొన్ని చెరువుల్లో ఏకంగా భవనాలను, ఫంక్షన్హాళ్లను నిర్మించేశారు. నగరంలో అంతర్భాగంగా మారిన శివారుల్లో సుమారు రూ. 295కోట్ల విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా.. అధికార యంత్రాంగంలో చలనం లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గండిపేట మండలం బండ్లగూడజాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ ఎర్రకుంట, గంధంగూడలోని చెరువు కనుమరుగు దశకు చేరుకున్నాయి. హైదర్షాకోట్లోని ఎర్రకుంట ఒకప్పుడు 6.20ఎకరాల్లో విస్తరించి ఉండగా.. ప్రస్తుతం అది 2.20ఎకరాలకు కుచించుకుపోయింది. ఈ కుంటలో ఏకంగా ఫంక్షన్హాల్ నిర్మించారంటే కబ్జా తీరును అర్థం చేసుకోవచ్చు. గతంలో కార్పొరేషన్ యంత్రాంగం తూతూమంత్రంగా కూల్చివేతలు చేపట్టిందన్న ఆరోపణలు ఉన్నాయి. స్థానికుల విన్నపం మేరకు కుంట చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణానికి రూ. 45లక్షలతో పనులు చేపట్టి అర్థాంతరంగా నిలిపివేశారు. ఫలితంగా దాదాపు నాలుగు ఎకరాల విలువైన ఎర్రకుం ట స్థలం కబ్జాలపాలైంది. ఈ స్థలం విలువ రూ. 200కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇంతటి విలువైన చెరువు కబ్జాకు గురైనా అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

కొత్తచెరువు 'హాంఫట్'.. గంధంగూడలోని సర్వేనం-66లో



4.13ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొత్త చెరువునూ స్థిరాస్తి వ్యాపారులు చెరబట్టేస్తున్నారు. ప్రస్తుతం కొత్త చెరువు ఎకరం విస్తీర్ణంలో మాత్రమే దర్శనమిస్తోంది. రూ. 95కోట్ల విలువ చేసే స్థలంలో లేఅవుట్ వేయడమే కాకుండా బహుళ అంతస్తుల భవన నిర్మాణాల చురుగ్గా జరుగుతున్నాయి. అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు చేపడుతున్నా.. కార్పొరేషన్ యంత్రాంగం, నీటిపారులదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

# నకిలీలకు చెక్!

వికారాబాద్ : రుతు పవనాలు ముందుగానే రానున్నాయన్న వాతావరణ శాఖ ప్రకటనతో అన్నదాతల్లో ఆనందం తొంగిచూస్తోంది. చినుకు పడగానే సాగును ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. విత్తన కొనుగోలు దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. ఇదే అదనుగా కొందరు అక్రమార్కులు కర్షకుల అవసరతను ఆసరాగా చేసుకుంటున్నారు. కృత్రిమ కొరత సృష్టించడంతో నకిలీ విత్తనాలను పల్లెల్లో విక్రయిస్తున్నారు. దీంతో జిల్లా వ్యవసాయ శాఖ ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేసేందుకు దుకాణాల్లో తనిఖీలు ముమ్మరం చేసింది. గ్రామ గ్రామాన నకిలీలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. అప్పటికీ నకిలీ విత్తనాలు కొడంగల్, తాండూరు తదితర ప్రాంతాల్లో పోలీసులకు దొరుకుతున్నాయి. దీంతో అధికారులు ఫోన్ నంబర్లు సైతం ఇచ్చి పల్లెపల్లెనా ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

సాగు అంచనా 5.95లక్షల ఎకరాలు

పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజక వర్గాల పరిధిలో ఎర్ర చెల్కనేలలతో పాటు చాలా వరకు నల్లరేగడి నేలలు ఉన్నాయి. దీంతో దాదాపు అన్ని పంటలకు అనుకూలం. ఇందులో ప్రధానంగా పత్తి పంట 2.63లక్షల ఎకరాల్లో సాగయ్యే సూచనలు ఉన్నాయి.



ఇందుకోసం 5,42,400 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం ఉన్నాయి. ఇప్పటికే 1.5లక్షలకు పైగా అధికారులు అందుబాటులో ఉంచారు. విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించడం ముఖ్యం. కొనే విత్తనాలకు సంబంధించి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని లైసెన్సు కలిగిన వ్యక్తుల వద్దనే కొనుగోలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. గ్రామాల్లో తక్కువ, ఎక్కువ ధరలకు అమ్మే వారి వివరాలను సంబంధిత వ్యవసాయాధికారి తెలపాలి. పక్క జిల్లా లేదా పక్క రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి ఎవరైనా విక్రయిస్తే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు..

రంగంలోకి స్క్వాడ్ బృందాలు

అధికారులు, కొందరు రైతుల అప్రమత్తత కారణంగా నకిలీ విత్తనాలు పొలాలకు చేరకముందే పట్టుబడ్డాయి. యాలాల, కొడంగల్, దౌల్తాబాద్, బషీరాబాద్ ప్రాంతాల్లో 36.93క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకుని ఐదు కేసులు నమోదు చేశారు. డివిజన్ స్థాయిలో నాలుగు స్క్వాడ్ టీంలు రంగంలోకి దిగాయి.

కఠినంగా వ్యవహరిస్తాం: గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పోలీసుశాఖ వారి సహకారంతో సమన్వయంతో మరింత కట్టడి చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయడంతో ఎక్కడికక్కడ పట్టుకుంటున్నాం. అక్రమంగా ఎవరైనా విక్రయిస్తే రైతులు నేరుగా ఫోన్ చేయవచ్చు.

# రండి... ప్రభుత్వ కళాశాల పిలుస్తోంది

సిరిసిల్ల : పదో తరగతి పూర్తి చేసిన ప్రతి విద్యార్థి తీసుకునే నిర్ణయం జీవితాన్ని మలుపుతిప్పుతుంది. లక్ష్యాలకు అనుగుణంగా కోర్సుల ఎంపికతో చదువు సాఫీగా సాగాలంటే ప్రణాళిక అవసరం. సాంకేతిక విద్యతోపాటు రెండేళ్ల ఇంటర్మీడియట్ కోర్సులపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తుంటారు. కార్పొరేట్కు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన వసతులను కల్పించింది. నాణ్యమైన విద్యాబోధన అందించేలా నిపుణులైన అధ్యాపకులు పని చేస్తున్నారు. జూన్ 1 నుంచి ఇంటర్ కళాశాలల్లో తరగతుల నేపథ్యంలో ప్రవేశాలు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. దీంతో ప్రధానాచార్యులతోపాటు అధ్యాపకులు విద్యార్థులను సర్కారు కళాశాలల్లో చేర్పించే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా, 31 ప్రభుత్వ సెక్టార్ (కస్తూర్బా, రెసిడెన్షియల్, వెల్ఫేర్, గురుకుల, ఆదర్శ పాఠశాలలు) కళాశాలలు ఉన్నాయి. ప్రైవేటుతో పోలిస్తే సర్కారు కళాశాలల్లో మెరుగైన వసతులు ఉన్నాయి. విశాలమైన తరగతి గదులు, ఉచిత పాఠ్య పుస్తకాలతోపాటు నిష్ణాతులైన అధ్యాపకులు బోధన చేస్తుంటారు. ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు, సహపాఠ్య కార్యక్రమాలు ఉంటాయి. ప్రకటనలు చూసి ప్రైవేటు కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్యను తగ్గించేందుకు ప్రభుత్వ కళాశాలలపై విస్తృత ప్రచారం చేస్తున్నారు.

పల్లెల్లో ఇంటింటి ప్రచారం

గతేడాదితో పోలిస్తే ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు దృష్టిసారించారు. గ్రామాల్లో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన పిల్లల వివరాలను అధ్యాపకులు సేకరిస్తున్నారు. ప్రధానాచార్యుడి సూచనలతో బృందాలుగా మారి ఆయా విద్యార్థుల ఇంటి తలుపు తడుతున్నారు. వారి తల్లిదండ్రులను ప్రత్యక్షంగా కలిసి సదుపాయాలు, బోధన తీరుతోపాటు గతేడాది సాధించిన ఫలితాలను వివరిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులను కలిసి కళాశాలలపై ప్రచారం చేసేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. జూన్ మొదటి వారంలో కళాశాలలను పునఃప్రారంభించి తరగతులు నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో జూన్ 30 వరకు ప్రవేశాలకు గడువు ఉండగా సీట్లను రిజర్వేషన్ పద్ధతిలో భర్తీ చేస్తారు.

తగ్గుతున్న ప్రైవేటు కళాశాలలు...ప్రభుత్వ కళాశాలల్లో వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయి. చాలా మంది పిల్లలు రెసిడెన్షియల్ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీనికి తోడు చాలా కళాశాలలు విద్యార్థుల ఉపకార వేతనాలతో అడ్మిషన్లు ఇచ్చేవి. సకాలంలో ఉపకార వేతనాలు జమ కాక నిర్వహణ భారం పెరిగింది. గతేడాది పది కళాశాలల నిర్వహణకు అనుమతి ఉండగా వీటి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తుంది. నిర్వహణ భారంతో ప్రైవేటు కాలేజీలు మూత బడుతున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో అనుమతి కోసం ఆరు కళాశాలలు ఇంటర్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్నాయి. అందులో అయిదింటికి మాత్రమే అనుమతి లభించింది.ప్రైవేటుకు దీటుగా బోధన ప్రైవేటు కళాశాలలకు దీటుగా సర్కారు కాలేజీల్లో వసతులు కల్పించి నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నాం. ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పెంచేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాం. రోజువారి సమీక్షలతోపాటు ప్రణాళికాబద్ధంగా ప్రధానాచార్యులు, అధ్యాపకులు ఉత్తీర్ణత పొందిన పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ ప్రవేశం పొందేలా చైతన్యపరుస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఒత్తిడి లేని విద్యను అందించి ఉత్తీర్ణతలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం. పిల్లల్లో పట్టుదలను నింపి ర్యాంకులు సాధించేలా చొరవ తీసుకుంటున్నాం.

# అనిశా నివేదికపై ఉత్కంఠ

కరీంనగర్ : డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్, పేర్ల మార్పిడి, ఇతర అంశాలకు సంబంధించి రవాణా శాఖ కార్యాలయాల్లో అవకతవకలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు కరీంనగర్ జిల్లా రవాణా శాఖ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. అధికారుల తనిఖీల్లో ఫైళ్లపై కోడ్, చెల్లించాల్సిన దానికంటే ఎక్కువ డబ్బులు చెల్లించడం, అనధికార వ్యక్తుల చేతుల్లో వాహనదారులకు సంబంధించిన పత్రాలు ఉన్నట్లు గుర్తించారు. దీంతో కొందరు సిబ్బంది యూనిఫాం వేసుకోలేదని తెలిసినట్లు సమాచారం. అనిశా తనిఖీల విషయం కొందరు ఏజెంట్లకు సమాచారం అందడంతో ఆ వైపుగా సదరు వ్యక్తులు రానట్లు తెలిసింది. 2016, జనవరిలో అనిశా తనిఖీలు చేయగా ఈ ఏడాది మరోసారి చేయడం సంచలనం సృష్టించింది.

పూర్తి వివరాలు నమోదు

డీఎల్, ఫిట్‌నెస్, ఇతర పనుల కోసం వచ్చిన వాహన దారుల ఫైళ్లను అధికారులు నిశితంగా పరిశీలించడంతోపాటు కోడ్ ఉన్న వాటికి సంబంధించిన పూర్తి వివరాలు నమోదు చేసుకున్నారు. వీటిపై సమగ్రంగా విచారణ చేయాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచా



రం. ఇప్పటికే కొందరి అధికారుల వ్యవహారశైలిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. అనిశా అధికారులు తమ తనిఖీల్లో గుర్తించిన అంశాలకు సంబంధించి ప్రభుత్వానికి ఎలాంటి నివేదిక ఇస్తారోనని ఆందోళన నెలకొంది. 2016లో దాడులకు సంబంధించిన విచారణ కొందరి సిబ్బంది మెడకు చుట్టుకోగా, ప్రస్తుతం జరిగిన తనిఖీల్లో ఎవరిని బాధ్యులను చేస్తారోనన్న ఆందోళన వ్యక్తం అవుతోంది.

వాహనదారులు లేక..

జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి నిత్యం వివిధ పనుల నిమిత్తం వందల సంఖ్యలో వాహనదారులు, వీరితో పాటు అనేక మంది అనధికార వ్యక్తులు (ఏజెంట్లు) వచ్చేవారు. అనిశా దాడుల నేపథ్యంలో ఆర్టీఏ కార్యాలయ సమీపంలో ఉన్న జిరాక్స్ షాపులు మూసి ఉంచడం కనిపించింది. దీంతోపాటు జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి డీఎల్, ఫిట్‌నెస్, లెర్నింగ్ లైసెన్స్, ఇతర పనుల కోసం వచ్చే వారి సంఖ్య తక్కువగా ఉండటంతో ఆర్టీఏ కార్యాలయం వెలవెలబోయింది.

# విద్యాశాఖ ఆదేశాలు బేఖాతరు!

మెట్‌పల్లి : వేసవి సెలవుల్లో పదో తరగతి ఫలితాలు వెల్లడైన తర్వాత ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రధానోపాధ్యాయుడితో పాటు జూనియర్ అసిస్టెంట్ లేదా సీనియర్ ఉపాధ్యాయుడు అందుబాటులో ఉండాలని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు ఫీజు చెల్లించే ప్రక్రియతో పాటు పాసయ్యేలా సలహాలు ఇవ్వడం, ఇతర విద్యార్థులకు అవసరమైన టీసీ, బోనఫైడ్ వంటి ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకోసం వారికి ఈఎల్(ఎర్న్డ్ లీవ్స్) మంజూరు చేస్తారు. బుధవారం మెట్‌పల్లి మండలంలోని పలు పాఠశాలలను ఉదయం 10.15 నుంచి 12 గంటల వరకు పరిశీలించగా ఎవరూ అందుబాటులో లేరు. ఆత్మకూర్, మెట్లచిట్టాపూర్, జగ్గాసాగర్, విట్టంపేట, బండలింగాపూర్ ఉన్నత పాఠశాలలను



పరిశీలించగా కార్యాలయాల గదులకు తాళాలే దర్శనమిచ్చాయి. 2022–23 విద్యా సంవత్సరంలో మండలంలోని ఓ పాఠశాల ఎఫ్ఏసీ ప్రధానోపాధ్యాయుడు విధులకు హాజరు కాకున్నా 19 ఈఎల్స్ పొందారని గ్రామ యువకులు కొన్ని నెలల కిందట ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి ఈఎల్స్‌ను రద్దు చేసిన విషయం విదితమే. అయినప్పటికీ మండలంలోని పలు పాఠశాలల్లో అదే తీరు కొనసాగు తుందని విద్యార్థుల తల్లిదండ్రులు, యువకులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచి ఉపాధ్యాయులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై డీఈవో జగన్మోహన్‌రెడ్డిని సంప్రదించగా ప్రధానోపాధ్యాయుడితో పాటు జూనియర్ అసిస్టెంట్ లేదా సీనియర్ ఉపాధ్యాయుడు పాఠశాలలో అందుబాటులో ఉండాల్సిందేనన్నారు. ఇందుకోసం ఈఎల్ మంజూరు చేస్తామని చెప్పారు. పాఠశాలల్లో అందుబాటులో ఉండాలని చెప్పామన్నారు. పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు.

# స్వచ్ఛ స్ఫూర్తి..హరితశోభ

తల్లాడ : పరిశుభ్రత, పచ్చదనంలో జిల్లాలోనే తల్లాడ మండల రామానుజవరం గ్రామం ప్రథమస్థానం దక్కించుకుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో 9 కేటగిరిల్లో ఉత్తమ గ్రామపంచాయతీలను ఎంపిక చేశారు. ఈ రెండు విభాగాల్లో మొదట స్థానం పొందింది. 2019 సంవత్సరంలో రామానుజవరం గ్రామసర్పంచిగా శీలం కోటారెడ్డి, ఆయన భార్య శీలం శివపార్వతి ఎంపీటీసీ సభ్యురాలుగా, తల్లాడ వైస్ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని గ్రామాభివృద్ధి ద్వారా నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో ఇద్దరు విశేషంగా కృషి చేశారు. సొంతంగా లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పంచాయతీ పరిధిలో పరిశుభ్రత, పచ్చదనం, పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చారు. పల్లెప్రకృతివనం, వైకుంఠధామం, జననివాస ప్రాంతాల్లో ఎంతో విలువైన ప్రాణవాయువు, ఫలాలను ఇచ్చే మొక్కలు పెంచి పోషించారు. రామానుజవరం పొలిమేరల్లో అడుగుపెట్టే ప్రతి ఒక్కరికి పచ్చదనం స్వాగతం పలుకుంది. రూ.18లక్షలతో వైకుంఠధామం వద్ద మహాశివుని విగ్రహం, మరో రూ.18లక్షలతో చెరువుకట్ట వద్ద అభయాంజనేయస్వామి విగ్రహం, రూ.8లక్షలతో చెరువు మధ్యలో గౌతమబుద్ధుని విగ్రహాలను నెలకొల్పారు. భూగర్భజలాల పరిరక్షణ కోసం గ్రామంలో ఇంకుడుగుంతలు నిర్మించారు. గ్రామంలో రహదారులకు ఇరువైపులా రకరకాల పూలు, పండ్లు, కొబ్బరి, ఈత మొక్కలను నాటి సంరక్షించారు. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొని జిల్లాస్థాయి ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేశారు.

# రైతుల పేరు.. దళారుల జోరు



నల్గొండ : నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు లేకపోవడం, గతేడాది వర్షాభావ పరిస్థితులతో ఆయకట్టు పరిధితో పాటు ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రాంతాల్లోని చెరువులు వట్టిపోయాయి. దీన్ని ఆసరాగా చేసుకొని చెరువులు, కుంటల్లోని విలువైన మట్టిని రైతుల మాటున దళారులు నిత్యం పదుల సంఖ్యలో ఇటుక బట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మిర్యాలగూడ, దేవరకొండ రెవెన్యూ డివిజన్లలోని మిర్యాలగూడ, కొండమల్లేపల్లి, మాడుగులపల్లి, నల్గొండ గ్రామీణ మండలాల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. మట్టి ట్రాక్టర్ లోడుకు రూ.3 వేలు, టిప్పర్ లోడుకు రూ.5వేల వరకు ఇటుక బట్టీల నిర్వాహకులు దళారులకు చెల్లిస్తున్నట్లు సమాచారం. కొన్ని చోట్ల ఇటుకబట్టీల నిర్వాహకులే రైతుల పేరుతో మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకొని రైతులకు నామమాత్రం చెల్లించి అనుమతులు ఇచ్చిన దాని కంటే ఎక్కువగా మట్టి తవ్వుకుంటున్నారు. దీనిపై పలు ఫిర్యాదులు రావడంతో మిర్యాలగూడ ఆర్డీవో క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. కొన్నిచోట్ల ఈ దందా ఆగినా తిరిగి గత రెండు మూడు రోజుల నుంచి ప్రారంభమైంది. ఉదాహరణకు మాడుగులపల్లి మండలం చెర్వుపల్లిలోని గార్ల చెరువు నుంచి మూడు హెక్టార్లలో పది వేల మెట్రిక్ టన్నుల మట్టిని తరలించేందుకు మైనింగ్ శాఖ గత నెల 29న అనుమతులు ఇవ్వగా ఇప్పటి వరకు అనుమతులు ఇచ్చినదానికంటే సుమారు ఐదింతలు ఎక్కువగా తవ్వకాలు జరిగినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. ఒకవైపు ఉన్నతాధికారులు లోక్‌సభ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణలో తీరిక లేకుండా ఉండటంతో క్షేత్రస్థాయి అధికారులను మేనేజ్ చేసి ఈ అక్రమ దందాను కొనసాగిస్తున్నారు.

శాఖల మధ్య సమన్వయలోపం

ఒకవైపు మట్టి తరలిస్తున్నా.. ఆపే బాధ్యత తమదంటే తమది కాదని రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. మూడు శాఖల్లో సమన్వయం లోపించడం, ఆ శాఖ అధికారులకు దళారులు పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెప్పారనే ఆరోపణలు వినిపిస్తుండటంతో వారూ మట్టి తరలింపు దందా నియంత్రణలో 'చూసీ'చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు రావడంతో తూతూ మంత్రంగా క్షేత్రస్థాయిలో పర్యటించడం.. రెండు, మూడు రోజులు కాగానే తిరిగి మట్టి మాఫియా తమ పని కానిచ్చేస్తున్నారు. ఇలా ఇప్పటికే మిర్యాలగూడ, మల్లేపల్లి, మాడుగులపల్లి, నల్గొండ మండలాల్లోని దళారులు రూ.కోట్లలో ఆర్జించినట్లు ఆరోపణలున్నాయి.

మిర్యాలగూడ, హాలియా, త్రిపురారం, నల్గొండ, వేములపల్లి మండలాల్లో భారీ సంఖ్యలో ఇటుక బట్టీలు ఉండటం, ఇప్పుడు వారికి సీజన్ కావడంతో మట్టి కొరత ఏర్పడింది. దీంతో పొలాలకు మట్టి తరలిస్తామని రైతుల పేరుతో మైనింగ్ అధికారుల అనుమతులు కోరుతూ అందులో 25 శాతం పొలాలకు తరలిస్తుండగా.. మిగతా 75 శాతం ఇటుక బట్టీలకు అమ్ముతున్నారు. మిర్యాలగూడ మండలంలోని యాదగిరిపల్లి, పండ్లపల్లి, రుద్రారం, వెంకటాద్రిపాలెం చెరువుల్లో వేల సంఖ్యలో ట్రాక్టర్లు నిత్యం మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇటీవల జిల్లా కలెక్టరుకు లేఖ రాసినా ప్రయోజనం లేదని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి 'ఈనాడు'కు తెలిపారు. మూడు శాఖల సమన్వయంతోనే ఈ మట్టి దందాను నియంత్రించే అవకాశం ఉంది.

హద్దులు గుర్తించడంలో నిర్లక్ష్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిన్ననీటి వనరుల హద్దులు గుర్తించడంలో సంబంధిత శాఖలు విఫలమవుతున్నాయి. చాలా చోట్ల రెవెన్యూ, నీటిపారుదల శాఖలకు సమన్వయం లేకపోవడంతో హద్దుల గుర్తింపులో తీవ్ర జాప్యం నెలకొంటోంది. దీంతో చెరువుల పునరుద్ధరణ పనులు సైతం సాగడం లేదు. మిర్యాలగూడ పట్టణంలోని పెద్ద చెరువును రూ.9 కోట్లతో మినీట్యాంకు బండ్‌గా తీర్చిదిద్దాలని 2016లో నిధులు మంజూరు కాగా.. హద్దుల గుర్తింపులో సమస్య ఉండటంతో ఇప్పటికీ పనులు అసంపూర్తిగానే మిగిలాయి. రెవెన్యూ వర్గాల సమాచారం ప్రకారం ఉమ్మడి జిల్లాలోని మొత్తం 4749 చెరువుల్లోని ఎఫ్‌టీఎల్ పరిధిలో 2.18 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నట్లు అంచనా. ఇలా హద్దులు గుర్తించకపోవడంతో సమీప రైతులు చెరువు ఎఫ్‌టీఎల్‌లోకి రావడం, కొన్ని చోట్ల స్థిరాస్తి సంస్థలు వెంచర్లను చెరువుల్లోనే నిర్మించడం పరిపాటిగా మారింది. ఇప్పటికైనా రెవెన్యూ, నీటిపారుదల శాఖలు చెరువుల సంరక్షణకు నడుం బిగించాల్సిన అవసరం ఉంది.

క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నాం – జాకబ్, ఏడీ, మైనింగ్ శాఖ, నల్గొండ జిల్లా

అనుమతులు ఇచ్చినదాని కంటే ఎక్కువగా మట్టి తరలింపు జరుగుతుందనే ఫిర్యాదుల నేపథ్యంలో మిర్యాలగూడ ప్రాంతంలోని పలు చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ చేస్తున్నాం. చెరువుల్లో నిబంధనలు ఉల్లంఘించారా లేదా అనేది ఒకట్రెండు రోజుల్లో తెలుస్తుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# కుంటల తవ్వకంపై 'మీన'మేషాలు



భానుపురి : మత్స్యకార సంఘాల బలోపేతానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తోడ్పాటు అందిస్తోంది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు బీడు భూములను సేద్యంలోకి తీసుకురావటం, నీటి వనరుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, సాగు రంగానికి అవసరమైన వనరులను తీర్చిదిద్దారు. తాజాగా మత్స్యకార సంఘాల పేరిట చేపల పెంపకానికి కుంటలు తవ్వే పనులు చేపడుతున్నారు. కానీ, దీనిపై ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మత్స్యకారులకు సంబంధిత అధికారులు అవగాహన కల్పించకపోవడంతో పథకానికి దూరమవుతున్నారు. నల్గొండ, భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లోని ఆయా గ్రామాల పరిధిలో ఉన్న ప్రభుత్వ చెరువులు, కుంటలు, చెరువు శిఖం, మత్స్య సహకార సంఘాల పేరిట ఉన్న భూముల్లో ఈ కుంటలు నిర్మిస్తారు. వీటిలో చేపల పెంపకానికి ఉపయోగకరంగా నాలుగు రకాల కుంటలు ఏర్పాటు చేస్తారు. ఒక్కోదానిలో సుమారుగా 20 వేల వరకు చేపలు పెరిగేలా నిర్మాణాలు చేపడతారు. ఉపాధి కూలీల ద్వారా చేయించే ఈ పనులకు కుంట నిర్మాణానికి రూ.9 లక్షల వరకు వెచ్చిస్తున్నారు.

పథకం వచ్చి మూడేళ్లు

చేపల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న మత్స్యకారుల కోసం కేంద్ర ప్రభుత్వం 2021లో ప్రధాన మంత్రి మత్స్యయోజన పథకాన్ని(పీఎంఎంవైఎస్) ప్రారంభించింది. ఈ పథకం ప్రారంభమై మూడేళ్లు అవుతున్నా పదుల సంఖ్యలోనే సద్వినియోగం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న మత్స్యకారుల్లో చాలా మంది నిరక్షరాస్యులు కావడంతో ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలపై అంతగా అవగాహన ఉండటం లేదు. ఈ పథకాలు క్షేత్రస్థాయిలోకి వెళ్లడంతోపాటు మత్స్యకారులకు అవగాహన కల్పించడంలో సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేస్తాం..

–రాజారాం, జిల్లా మత్స్యశాఖ అధికారి, యాదాద్రి భువనగిరి

జిల్లాలో చేపల పెంపకానికి కుంటలు తీసుకునేందుకు 25 మందిని ఎంపిక చేశాం. ఇప్పటికే వారు చేపల పెంపకాన్ని చేపట్టారు. మిగతా వారు దరఖాస్తు చేసుకుంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపిక చేస్తాం.

# ఆరంభం అదిరింది.. అనంతరం చెదిరింది!

ఇల్లెందు : నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐటీడీఏ) సంకల్పించింది. ఇందుకోసం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని భద్రాచలం, ఇల్లెందు, ఖమ్మం గ్రామీణ మండలం మద్దులపల్లిలో యువజన శిక్షణ కేంద్రాలు (వైటీసీలు) ఏర్పాటు చేసింది. ఆరంభంలో అనేక కోర్సులకు సంబంధించిన శిక్షణ ఇవ్వటంతో పలువురు నిరుద్యోగులు స్వయం ఉపాధి రంగంలో స్థిరపడ్డారు. గతంలో కోర్సులు..పోలీస్ కానిస్టేబుల్, గ్రూప్–1, 4, సోలార్ ప్యానెల్ ఇన్‌స్టలేషన్, ఫీల్డ్ టెక్నీషియన్ (హోం అప్లియన్స్), లైట్ మోటార్ డ్రైవింగ్, ఫొటో, వీడియోగ్రఫీ, రిటైల్ సేల్స్, వెబ్ డెవలపర్, ఫౌండేషన్ కోర్సులకు సంబంధించిన శిక్షణ ఇచ్చారు. వీటిని సద్వినియోగం చేసుకున్న పలువురు ఉద్యోగాలు పొందారు. మరికొందరు స్వయం ఉపాధి రంగంలో రాణిస్తున్నారు.

ఈఏడాదిలో.. హోటల్ మేనేజ్‌మెంట్, జీఎస్టీ విత్ అకౌంట్స్, లైట్, హెవీ మోటార్ వెహికిల్ శిక్షణ, సోలార్ టెక్నీషియన్, బీటెక్ అభ్యసించిన వారికి వెబ్ డెవలపర్ కోర్సులు, డాక్యుమెంట్ అసిస్టెంట్, రిటైలర్, బ్యూటీషియన్, టైలరింగ్, ఎలక్ట్రీషియన్, సీసీటీవీ టెక్నీషియన్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఆర్ఆర్‌బీ ఉద్యోగార్థులకూ శిక్షణ ఉంటుంది.

మూడు అంశాల ఆధారంగా శిక్షణ

నిరుద్యోగులకు స్వయం ఉపాధి, ఉద్యోగావకాశాలు దక్కేలా చూడటం, నైపుణ్యాభివృద్ధిని మెరుగుపరచాలనే ఉద్దేశంతో వైటీసీలు పనిచేస్తున్నాయి. తొలినాళ్లలో మూడు శిక్షణ కేంద్రాలు ఏటా సుమారు 1,200 మంది నిరుద్యోగులకు తర్ఫీదునిచ్చాయి. మూడేళ్లుగా ఆసంఖ్య 1,000 దాటకపోవటం గమనార్హం. ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఆర్థిక సంవత్సరం శిక్షణ ప్రారంభం కాలేదు. సుమారు రెండు నెలల కాలం గడిచిపోయింది.

ఎన్నో ఆశలతో...

ఇల్లెందులో 2012లో రూ.20 కోట్లతో వైటీసీని నిర్మించారు. ఒకేసారి



ఐదు బ్యాచ్‌ల వరకు శిక్షణ ఇచ్చేలా వసతులు కల్పించారు. గతంలో ఏటా 500 మందికి తగ్గకుండా నిరుద్యోగులు తర్ఫీదు పొందేవారని, ఇప్పుడు ఉపాధ్యాయుల శిక్షణ, శిక్షణేతర కార్యకలాపాలకే ఇల్లెందు వైటీసీ పరిమితమవుతోందని విద్యార్థి సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భద్రాచలంలో 2014లో వైటీసీని ప్రారంభించారు. 2019లో నూతన భవనం నిర్మించారు. మిగతా రెండు సెంటర్లతో పోల్చితే ఇక్కడ శిక్షణ మెరుగ్గా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మద్దులపల్లిలోని 2016లో వైటీసీని నిర్మించారు. అందులోని ఒక ఫ్లోర్‌లో జేఎన్టీయూ ఇంజినీరింగ్ తరగతులు కొనసాగుతున్నాయి. ఇక్కడ వైటీసీలో శిక్షణ కార్యక్రమాలు నామమాత్రమయ్యాయని నిరుద్యోగులు చెబుతున్నారు. ఈ సంవత్సరం ఎన్నికల కోడ్ వల్ల శిక్షణ ఇవ్వటం జాప్యమైంది. ఎన్నికల కోడ్ ముగిశాక వైటీసీల పరిధిలో జూన్ చివరి వరకు ఎంపిక చేసిన వారికి జులై నుంచి తర్ఫీదు ఇస్తాం. నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించేలా, స్వయం ఉపాధి పొందేలా కొన్ని కోర్సులకు సంబంధించి ప్లేస్‌మెంట్లు ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తాం. హరికృష్ణ, జాబ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, ఐటీడీఏ

# కంభంపాటి.. సాగులో మేటి

తల్లాడ : వారిద్దరూ అన్నదమ్ములు. పైగా కవలలు. ఇద్దరూ ఇంజినీరింగ్ విద్యనభ్యసించారు. ఉన్నత చదువులు చదివినా సాగుపైనే మక్కువ ఎక్కువ. దీంతో తాము చేస్తున్న కొలువును వదిలేసి పొలం దిక్కు చూశారు. ప్రకృతి సేద్యం పద్ధతుల్లో కలిసి 'సాగు'తూ ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారు. వారే టేకులపల్లి మండలానికి చెందిన కవల సోదరులు కంభంపాటి నరేశ్, నవీన్. చింతోనిచెలక గ్రామానికి చెందిన వీరు రెండేళ్ల క్రితం 'చేను–చెలక' పేరిట ప్రకృతి సేద్యానికి శ్రీకారం చుట్టారు. ప్రారంభ ఏడాది వరి సాగుపై దృష్టి సారించారు. ప్రకృతి సేద్యంలో భాగంగా మిరప సాగు చేసి మంచి లాభాలు ఆర్జించారు. కంభంపాటి సోదరులు గతేడాది మొత్తం మూడున్నర ఎకరాల భూమిలో మిరప సాగు చేశారు. పూర్తి సేంద్రియ పద్ధతిలో దీన్ని పండించారు. ఇందులో అర ఎకరం తేజ రకం, మిగిలిన రెండున్నర ఎకరాల్లో లావురకం మిరప పంట వేశారు. విత్తనాలు, డ్రిప్, దుక్కి ఖర్చు, మల్చింగ్, ఆర్గానిక్ మందులైన ఘన జీవామృతం, అగ్నిఅస్త్రం, బ్రహ్మాస్త్రం, పుల్లటి మజ్జిగ, పంచగవ్యల తయారీ, కూలీల ఖర్చు ఇలా మొత్తం రూ.4.5 లక్షల వరకు ఖర్చయిందని తెలిపారు.



దిగుబడి అలా..

తమకు మొదటి కోతలో సన్నరకం మూడు క్వింటాళ్లు రాగా రూ.19,500 చొప్పున, ఆర్మూరు రకం 12 క్వింటాళ్లు రాగా రూ.15 వేల చొప్పున మార్కెట్‌లో విక్రయించారు. లావు రకం 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని వివరించారు. లావు రకం మిరప కిలో రూ.350, మరో లావు రకం రూ.250 చొప్పున మొత్తం 10 క్వింటాళ్లు విక్రయించారు. మొదటి కోతలో సరాసరిగా సన్న, లావురకం మీద రూ.5 లక్షలు వరకు ఆదాయం వచ్చింది. ఇక రెండో కోతలో రెండు రకాలు కలిపి 30 క్వింటాళ్లు దిగుబడి వచ్చిందని, కూలీల ఖర్చు పోగా తమకు రూ.5లక్షల వరకు నికర ఆదాయం మిగిలిందని యువ రైతులు పేర్కొన్నారు."ప్రకృతి సేద్యం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు స్వచ్ఛమైన పంట దిగుబడులను అందించవచ్చు. పర్యావరణ పరిరక్షణకు ఇది తోడ్పాటు అందిస్తుంది. మేం పండించిన లావు రకం మిరపను కిలోల చొప్పున విక్రయించాం. సింగపూర్‌కు 50 కిలోల ఆర్డర్లు వచ్చాయి."– రైతులు నరేష్, నవీన్.


# నకిలీల కట్టడికి నమూనా..

ఖమ్మం : నకిలీ విత్తనాల విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది. నాణ్యత లేని విత్తనాలను కొని అన్నదాతలు నష్టపోకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పత్తి, వరి, ఇతర విత్తనాల నమూనాలు సేకరించాలని నిర్ణయించారు.

నకిలీ విత్తనాల విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది. నాణ్యత లేని విత్తనాలను కొని అన్నదాతలు నష్టపోకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పత్తి, వరి, ఇతర విత్తనాల నమూనాలు సేకరించాలని నిర్ణయించారు. ఉభయ జిల్లాల్లో 2024 వానాకాలం ప్రారంభం నుంచి 2025 ఫిబ్రవరి వరకు అన్ని ఎరువుల దుకాణాల్లో విత్తన నమూనాలు సేకరించాలని సర్కారు నిర్దేశించింది. ఈదిశగా వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించేందుకు ప్రణాళి కలు రూపొందిస్తున్నారు.

15 రోజుల్లో నాణ్యత ఫలితాలు

గతంలో నకిలీ విత్తనాలు లభించటంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని కొందరు డీలర్లపై కేసులు నమోదు చేశారు. ఈఏడాది సైతం నకిలీ విత్తనాల విక్రయాలపై నిఘా ఉంచుతున్నారు. పోలీసు, వ్యవసాయ శాఖల అధికారులతో తనిఖీ బృందాలను నియమిస్తున్నారు. వానాకాలంలో పంటల సాగు విస్తీర్ణం పెరగనున్న నేపథ్యంలో విత్తనాల పంపిణీపై దృష్టి సారిస్తున్నారు. లక్ష్యాలకు అనుగుణంగా సేకరించిన విత్తన నమూనాలను హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పంపించను న్నారు. 15 రోజుల తర్వాత ల్యాబ్ నుంచి వచ్చిన ఫలితాల ఆధారంగా విత్తనాలు సాగుకు అనుకూలం కాకపోతే సదరు దుకాణాల్లో విక్రయాలను నిలిపేస్తారు. శాఖాపరమైన చర్యలు తీసుకుంటారు.



సీజన్ మొత్తం తనిఖీలు..

వ్యవసాయ సీజన్ జూన్ నుంచి ఫిబ్రవరి వరకు ఉంటుంది. ఉభయ జిల్లాల్లోని విత్తన విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరించేలా వ్యవసాయాధికారులకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. క్షేత్రస్థాయిలో ఏఓలు నమూనాలు సేకరించి ఉన్నతాధికారుల ఆదేశాలతో ల్యాబ్‌కు తరలించనున్నారు. నెలవారీ లక్ష్యాల ప్రకారం నమూనాలు సేకరించటంతో డీలర్లు నకిలీ విత్తనాలను విక్రయించే ఆస్కారం ఉండబోదని అధికారులు చెబుతున్నారు. ఏదైనా దుకాణంపై అనుమానమొచ్చినా, ఫిర్యాదులందినా రెండు, మూడుసార్లు నమూనాలు సేకరిస్తామని స్పష్టం చేస్తున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

లైసెన్స్‌డ్ దుకాణాల్లోనే విత్తనాలు కొనాలి. విత్తన ప్యాకెట్, బస్తాలపై లాట్ నంబర్, కంపెనీ పేరు, ప్యాకింగ్ తేదీ వంటి వివరాలు ఉన్నాయో లేదా చూసుకోవాలి. విత్తనాల కొనుగోలుకు సంబంధించిన రసీదును భద్రపరచుకోవాలి. అనుమతులు లేకుండా విడిగా విక్రయించే గింజలను కొనొద్దు. దళారుల మాటలు నమ్మొద్దు. విత్తన నాణ్యతపై సందేహాలుంటే వ్యవసాయాధికారులను సంప్రదిం చాలి. నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారని గుర్తిస్తే వ్యవసాయా ధికారులు లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు వ్యవసాయ సీజన్ పూర్తయ్యే వరకు అన్ని విత్తన దుకాణాల్లో తనిఖీలు చేసి నమూనాలను ప్రయోగశాలకు పంపిస్తాం. ఫలితాల ఆధారంగా డీలర్లు, సదరు కంపెనీలపై తదుపరి చర్యలు తీసుకుంటాం. బాబూరావు, డీఏఓ, భద్రాద్రి కొత్తగూడెం

# జూలై 8నుంచి ఢిల్లీలో లాల్‌దర్వాజ మహంకాళి బోనాలు

హైదరాబాద్: లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయ దశాబ్ది బోనాల ఉత్సవాలను జూలై 8 నుంచి 10 వరకు ఢిల్లీలో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సి.రాజేందర్‌యాదవ్ తెలిపారు. పాతబస్తీలోని లాల్‌దర్వాజలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015లో ఆనాటి ఆలయ చైర్మన్ మాణిక్‌ప్రభుగౌడ్ సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయం ఆధ్వర్యంలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బోనాల ఉత్సవాలను నిర్వహించడం ప్రారంభించారన్నారు. నాటినుంచి ప్రతిఏటా పాతనగర బోనాల ఉత్సవాలకు ముందు ఢిల్లీలో బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అందులో భాగంగా ఈ యేడాది దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. జూలై 7న అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఢిల్లీకి బయల్దేరుతామని తెలిపారు. 8న విలేకరుల సమావేశం, 9న తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా ఇండియా గేట్ నుంచి ఘటం ఊరేగింపు తీసుకెళ్లి తెలంగాణ భవన్‌లో స్థాపించి 10న బోనాల సమర్పణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు మారుతీయాదవ్, అరవింద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



**కమిటీ నుంచి సభ్యుల తొలగింపు :** లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీమహంకాళి దేవాలయం 2022-23 సంవత్సరంలో ఆదాయ వ్యయాలకు సంబంధించిన వివరాలు అందజేయాలని నాటి ఆలయ ఫోర్‌మెన్ కమిటీ చైర్మన్‌లుగా వ్యవహరించిన బద్రీనాథ్‌గౌడ్, పోసాని సురేందర్‌ముదిరాజ్, సీరా రాజ్‌కుమార్, శివకుమార్ యాదవ్‌లకు నోటీసులు జారీ చేసినా సమర్పించకపోవడంతో వారిని కమిటీనుంచి తొలగించామని తెలిపారు. అంతేకాకుండా ఐపీ పెట్టిన ఆలయ మాజీ కోశాధికారి పోసాని సదానంద్ ముదిరాజ్‌ను, ఆలయ నియమాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన పోసాని సుధాకర్ ముదిరాజ్‌లను కమిటీ నుంచి తొలగించినట్లు తెలిపారు.






# రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు దూరంగా సోనియాగాంధీ... కారణమిదే..?

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. జూన్2వ తేదీన రాష్ట్ర ద్విశాబ్ది ముంగిపు వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం, సాయంత్రం ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడకలకు ముఖ్య అతిథిగా ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావించారు.

అయితే సోనియా తెలంగాణ పర్యటన రద్దయ్యే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది. అనారోగ్య కారణాలతో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఆమె హాజరకావడం లేదన్న ప్రచారం జరుగుతోంది.

**అనారోగ్య సమస్యలతో దూరం..!** గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఆమె సతమతం అవుతున్నారు. ఈ కారణంతోనే లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రచారానికి దూరంగా సోనియాగాంధీ ఉన్నారు. అయితే ఆమె తెలంగాణ పర్యటనపై ఇంకా పూర్తిగా స్పష్టత రాలేదు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నాలని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి ఆహ్వానించిన విషయం తెలిసిందే. రేపు తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సోనియాగాంధీ వస్తారని రాష్ట్ర కాంగ్రెస్ అగ్ర నేతలు చెప్పారు. వేడుకల్లో ఆమె ప్రసంగించడానికి సంబంధించిన స్పీచ్ ను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా సోనియా రాకపోవచ్చనే సమాచారం తెలుస్తోంది. ఎండ, వేడి గాలుల నేపథ్యంలో వైద్యులు విశాంత్రి తీసుకోమని చెప్పినట్లు తెలుస్తోంది. అందుకనే ఈ మేరకు సోనియా గాంధీ తెలంగాణ పర్యటనను రద్దు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నట్లు తెలుస్తోంది.

**రాహుల్ గాంధీని తీసుకొచ్చేలా...** ఒక వేళ ఆమె రాకపోతే ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని అయినా ఈ వేడుకలకు తీసుకురావాలని అగ్రనేతలు సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు ఆమె తెలంగాణ పర్యటన గురించి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఒకవేళ సోనియా రాలేని పరిస్థితి ఉంటే ప్రత్యామ్నాయ నిర్ణయం కోసం ఆలోచిస్తున్నారు. తెలంగాణను తానే తీసుకొచ్చానని మాజీ సీఎం , బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు భావిస్తున్నారు. ఈ విషయం ప్రచారంలో కూడా ఉంది.

తెలంగాణ బిల్లుకు సంబంధించి సోనియా గాంధీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని.. ఎలాంటి పరిస్థితుల్లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వాల్సి వచ్చిందనే విషయాన్ని రాష్ట్ర ప్రజలకు తెలియజేయవచ్చని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఒకవేళ ఆమె వేడుకల్లో పాల్గొనకపోతే రాష్ట్ర ఆవిర్భావం గురించి ఓ వీడియో సందేశం ఏర్పాటు చేసేలా కాంగ్రెస్ నేతలు ప్లాన్ చేస్తున్నారు.

# ఏపీ ఎన్నికలపై ఫలితాలపై కోమటిరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



తిరుమల: ఏపీ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. నేడు ఆయన తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ ప్రజలు మార్పు కోరుకుంటున్నారా..? లేక వైసీపీకీ పట్టం కడతారోనన్న ఉత్కంఠ నెలకొందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు. ఏపీలో ప్రజల నాడి ఎవరికీ అంతుబట్టడం లేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్.. బీజేపీ మధ్య హొరా హొరీ పోరు జరిగిందన్నారు. తెలంగాణలో బీజేపీ.. కాంగ్రెస్ సమాన సీట్లు గెలుచుకునే అవకాశం ఉందన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ తుడుచు పెట్టుకుపోయిందన్నారు. భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి కిరణ్ కచ్చితంగా గెలుస్తాడన్నారు. దేశంలో మొదట్లో బీజేపీ హవా కొనసాగగా..అటు తరువాత ఉత్తరాదిన కాంగ్రెస్, ఇండియా కూటమి బాగా పుంజుకుందన్నారు. భవిష్యత్‌ని నిర్ణయించే ఎన్నికలు కాబట్టి ప్రజలు మంచి తీర్పు ఇస్తారని ఆశిస్తున్నానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలిపారు.

# 10 ఏళ్ల రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు గవర్నర్‌కు ఆహ్వానం



హైదరాబాద్ : తెలంగాణ 10 ఏళ్ల ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తున్నారు.

ఈ క్రమంలోనే తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాజ్ భవన్ వెళ్లి రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు రావాలని గవర్నర్‌కు సీఎం, డిప్యూటీ సీఎం పూల బోకే ఇచ్చి మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు. మరోవైపు ఈ కార్యక్రమానికి ఇప్పటికే సోనియా గాంధీని కూడా ఆహ్వానించారు. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఈరోజు చివరి రోజు అని చెప్పవచ్చు. ఎందుకంటే జూన్ 2న 'అపాయింటెడ్ డే' నాడు ఇది తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే రాజధానిగా ఉంటుంది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్నాయి. దీంతోపాటు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పోలీసులు ప్రకటించారు.

ఈ ఆంక్షలు శనివారం ఉదయం నుంచి ఆదివారం రాత్రి 12 గంటల వరకు కొనసాగుతాయని వెల్లడించారు.

## ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు చల్లని కబురు

హైదరాబాద్: గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలకు వాతావరణశాఖ చల్లని కబురు చెప్పింది. ఆదివారం నుంచి రాగల 5 రోజుల పాటు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. జూన్ మూడో



తేదీ నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపి తగ్గి వాతావరణం చల్లబడుతుందని ప్రకటించింది. మే 30న రుతుపవనాలు కేరళను తాకాయని, జూన్ 5, 6 తేదీల్లో రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గత రెండ్రోజులుగా 44 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని.. శనివారం సాయంత్రం కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందన్నారు.

## ఎర్రవల్లి చౌరస్తాలో కారు-లారీ ఢీ.. బాలుడు సహా నలుగురు మృతి

గద్వాల: జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శనివారం తెల్లవారుజామున ఎర్రవల్ల చౌరస్తాలోని పెట్రోల్ పంపు వద్ద జాతీయ రహదారిపై కారు, లారీ ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మరణించారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను కర్నూలు దవాఖానకు తరలించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ నుంచి హైదరాబాద్ వస్తుండగా ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి ఉన్నారని చెప్పారు. అంతా ఒకే కుటుంబానికి చెందినవారని వెల్లడించారు. మృతులను వెంకటేశ్ (కారు డ్రైవర్), భార్య పుష్ప (35), తల్లి లత (55), వెంకటేశ్ చెల్లెలు కుమారుడు ఆదిత్య (6)గా గుర్తించారు. అతివేగం, నిద్రమత్తు కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 5 వీవీ ప్యాట్ల స్లిప్పులు లెక్కింపు: జీహెచ్‌ఎంసీ కమిషనర్



హైదరాబాద్: కౌంటింగ్ సిబ్బందికి మే 26 నాటికే శిక్షణ పూర్తయిందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ తెలిపారు. నిజాం కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక అబ్జర్వర్ ఉంటారని తెలిపారు.ప్రతి కౌంటింగ్ కేంద్రంలో మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. "హైదరాబాద్‌లోని 13 ప్రాంతాల్లో 16 హాల్స్‌లో ఓట్ల లెక్కింపు ఉంటుంది. 3 చోట్ల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉంటుంది. ప్రతి కౌంటింగ్ హాల్‌లో 14 టేబుళు ఏర్పాటు చేశాం. జూబ్లీహిల్స్‌లో అత్యధికంగా 20 టేబుళ్లు ఉంటాయి. యాకుత్‌పురాలో అత్యధికంగా 24 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉంటుంది. చార్మినార్ నియోజకవర్గంలో 15 రౌండ్లలో, కంటోన్మెంట్ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు 17 రౌండ్లలో జరుగుతుంది. ప్రతి రౌండ్‌కు 30 నిమిషాల సమయం పడుతుంది. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 5 వీవీ ప్యాట్ల స్లిప్పులు లెక్కిస్తాం" అని రొనాల్డ్‌రాస్ తెలిపారు.

# గత ప్రభుత్వం కాంగ్రెస్ నేతలను ఆహ్వానించలేదు: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: తెలంగాణ కోసం ఎన్నో వర్గాల ప్రజలు పోరాటం చేశారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. తెలంగాణ వచ్చాక పదేళ్లు నియంతృత్వం కొనసాగిందని విమర్శించారు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ఏర్పడిందన్నారు. అమర వీరులను స్మరించుకుంటూ ఆవిర్భావ వేడుకలు జరుగుతాయని వివరించారు. రాజకీయాలకు అతీతంగా వేడుకలకు అందరినీ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. "ప్రధాని మోదీ ఎన్నోసార్లు తెలంగాణ ఏర్పాటును అవమానించారు. వేడుకలకు సోనియా గాంధీ వస్తారని ఆశిస్తున్నాం. గత ప్రభుత్వం తెలంగాణ వేడుకలకు కాంగ్రెస్ నేతలను



ఆహ్వానించలేదు. రాష్ట్ర చిహ్నం రూపకల్పనలో భారాస ప్రభుత్వం ఎవరి అభిప్రాయాలు తీసుకోలేదు" అని పొన్నం ప్రభాకర్ అన్నారు.

# ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ చేయించాలి: సీఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డికి భాజపా ఎంపీ బండి సంజయ్ లేఖ రాశారు. పోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ కోరాలని అందులో పేర్కొన్నారు. రాష్ట్రంలో సీబీఐని నిషేధిస్తూ గత ప్రభుత్వం జీవో ఇచ్చిందని చెప్పారు. ఆ జీవోను రద్దు చేయాలని కోరారు.

కేసీఆర్, కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నడిపించారని ఆరోపించారు. వారికి నోటీసులు ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోందని బండి సంజయ్ చెప్పారు.

# ప్రజలకు రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు: మంత్రి జూపల్లి

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అలుపెరుగని పోరాటాలు, బలిదానాలతో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఈ సందర్భంగా వారు చేసిన సేవలను మంత్రి గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరుల త్యాగాల్ని స్మరించుకునే ఆవిర్భావ దినోత్సవానికి ఎంతో ప్రాముఖ్యం ఉందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారికి ఈ సందర్భంగా నివాళి అర్పిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ సమానంగా అందినప్పుడే అమరులకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు, సకల జనులకు, ప్రత్యేక రాష్ట్ర అకాంక్షను గౌరవించి మద్దతు తెలిపిన ప్రతీ ఒక్కరికీ, తెలంగాణ కలను సాకారం చేసిన సోనియా గాంధీకి ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీగా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని వ్యాఖ్యానించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తోందని అన్నారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్న మహనీయుల ఆశయ సాధనకు' ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. అన్నివర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్ననలను పొందుతున్నదని వివరించారు. యావత్ తెలంగాణ సమాజం మనోభావాలకు అనుగుణంగా, ప్రజా సంఘాలు, పౌర సంస్థలు, ఉద్యోగ సంఘాలతో సంప్రదిస్తూ... వారి అభిప్రాయాలను గౌరవిస్తూ... ప్రజాస్వామిక పాలనను అందిస్తూ... కాంగ్రెస్ ప్రభుత్వం నూతన ఒరవడిని సృష్టించిందని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను...
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.
సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660